నమస్తే తెలంగాణ

# నాగర్‌కర్నూల్

5 | మహబూబ్‌నగర్, శనివారం 1 మార్చి 2025 | NAGARKURNOOL




సింగోటంలో మీడియాతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కవిత, చిత్రంలో ఎమ్మెల్సీ నవీన్, మాజీ ఎమ్మెల్యే బీరం

# కాంగ్రెస్‌వి బోగస్ మాటలు

- పింక్‌బుక్‌ను మెయింటనెన్స్ చేస్తున్నాం
- దాడి చేసిన వారి చిట్టా రాసి పెడ్తున్నాం
- మీడియాతో ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

కొల్లాపూర్, ఫిబ్రవరి 28 : బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలపై దాడులు చేసిన వారి చిట్టా పింక్ బుక్‌లో రాస్తామని, సమయం వచ్చిన రోజు వారి సంగతి తేలుస్తామని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. ప్రతిపక్షాలపై దాడులు మానుకొని ప్రభుత్వం అభివృద్ధిపై దృష్టి సారించాలని సూచించారు. శుక్రవారం కొల్లాపూర్ మండలం సింగోటం గ్రామంలోని లక్ష్మీ నర్సింహస్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డితో కలిసి ఆమె మీడియాతో మాట్లాడారు. సింగోటంలో లింగాకారంలో లక్ష్మీ నర్సింహస్వామి ఉండటమన్నది చాలా ప్రత్యేకమన్నారు. ఇలాంటి అద్భుతమైన క్షేత్రాన్ని దర్శించుకోవడం అదృష్టంగా భావిస్తున్నట్లు తెలిపారు. ఈ క్షేత్రం అభివృద్ధికి కేసీఆర్ రూ.17 కోట్లు మంజూరు చేస్తే దేవుడికిచ్చిన డబ్బులను కూడా మంత్రి జూపల్లి కృష్ణారావు క్యాన్సిల్ చేయించడం దౌర్భాగ్యమన్నారు. ఒక ప్రభుత్వం ఇచ్చిన పథకాలు తర్వాత సర్కారు కొనసాగించాలే కానీ.. కక్ష పూరితంగా వ్యవహరించడం సరికాదన్నారు. వెంటనే ఆలయాభివృద్ధికి జూపల్లి కృషి చేయాలని డిమాండ్ చేశారు. కొల్లాపూర్ నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ తరుపున నిలబడిన ఏ నేత సోషల్ మీడియాలో చిన్న పోస్టులు పెట్టినా.. నిలబడి ప్రశ్నించినా కేసులు పెట్టి ఇబ్బందుల పాలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. రేవంత్ ప్రభుత్వం వచ్చాక గులాబీ పార్టీ శ్రేణులపై దాడుల పరంపర కొనసాగుతోందన్నారు. బీఆర్‌ఎస్ నేత శ్రీధర్‌రెడ్డి హత్యకు గురైనా.. మంత్రి జూపల్లి ఇలాకాలో ఇంకా కేసులో ఎలాంటి పు రోగతి లేదన్నారు. హంతకులకు కొమ్ముగాస్తున్నారే తప్పా ప్రజల పక్షాన మీరు నిలబడింది లేదని విమర్శించారు. జూపల్లి టూరిజం మంత్రిగా కాకుండా టూరిస్టు మంత్రిగా ఉన్నాడన్నారు. అప్పుడప్పుడు నియోజకవర్గానికి వచ్చిపోవాలని ఎద్దేవా చేశారు. ఇక్కడ పండే మామిడి దేశవిదేశాలకు ఎగుమతి జరుగుతుందని, కేసీఆర్ ప్రభుత్వంలో మాజీ ఎమ్మెల్యే బీరం కొల్లాపూర్‌కు మామిడి మార్కెట్ మంజూరు చేయిస్తే ఈ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ధ్వజమెత్తారు. రైతుభరోసా, రుణమాఫీ ఎక్కడా పూర్తి స్థాయిలో అమలు కాలేదన్నారు. కనీసం ప్రభుత్వం చెప్పిన తేదీలోపు రైతుభరోసా డబ్బులు వేయాలని డిమాండ్ చేశారు. సాతాపూర్‌లో మీటింగ్ కో సం ఫ్లెక్సీలు కట్టిస్తున్న బీఆర్‌ఎస్ నేత పరమేశ్‌పై దాడి చేశారని, రాష్ట్రంలో ఇదేమి రాజ్యం నడుస్తోందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. సీఎం సొంత జిల్లా మహబూబ్‌నగర్ గడ్డ మీది నుంచి చెబుతున్నాను.. మేము కూడా పింక్ బుక్ మెయింటనెన్స్ చేస్తున్నామన్నారు. కార్యకర్తలపై, నాయకులపై దాడి చేసిన వారి చిట్టా రాస్తామని.. టైం వచ్చినప్పుడు వారి సంగతి చెబుతామని ఆమె హెచ్చరించారు. సమావేశంలో బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు రంగినేని అభిలాశ్‌రావు, ధూరెడ్డి రఘువర్ధన్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కిషన్‌నాయక్ పాల్గొన్నారు.

# కవితకు నీరాజనం

- ఎన్మన్‌బెట్ల ఎక్స్ రోడ్డు నుంచి సింగోటం ఆలయం వరకు ఘన స్వాగతం
- అనంతరం లక్ష్మీనర్సింహస్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలు



గజమాలతో ఎమ్మెల్సీ కవితకు స్వాగతం పలుతుకున్న నేతలు

కొల్లాపూర్ రూరల్, ఫిబ్రవరి 28 : మండలంలోని సింగోటం లక్ష్మీనర్సింహ స్వామిని ఎమ్మెల్సీ కవిత దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే బీరం, రాష్ట్ర నాయకులు రంగినేని అభిలాష్‌రావు, ధూరెడ్డి రఘువర్ధన్‌రెడ్డితో వచ్చిన కవితకు ఆలయం వద్ద అర్చకులు వేద మంత్రాలు, బాజా భజంత్రీలతో ఆహ్వానం పలికారు. అంతకుముందు ఆమెకు ఎన్మన్‌బెట్ల చౌరస్తా వద్ద మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి ఘన స్వాగతం పలికారు. అక్కడి నుంచి బీఆర్‌ఎస్ నేత సురేందర్‌రావు ఆధ్వర్యంలో శ్రేణులు డీజే పాటలతో పెద్ద ఎత్తున ర్యాలీగా ఆలయం వరకు చేరుకున్నారు. ఈ సందర్భంగా జై కేసీఆర్.. పూలు చల్లుతూ అడుగడుగునా ఘన స్వాగతం పలికారు. పటాకులు కాల్చి ఆమెకు శాలువా కప్పి సన్మానించారు. పార్టీశ్రేణులు, ప్రజలు పెద్ద ఎత్తున తరలిరాగా ఆలయ ప్రాంగణం కార్యకర్తలతో సందడిగా మారింది. కవిత వద్ద ఫొటోలు దిగడానికి కార్యకర్తలు పోటీపడ్డారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



సింగోటంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్సీ కవిత

# కాంగ్రెస్ గూండాయిజం

- బీఆర్‌ఎస్ నేతపై హత్యాయత్నం
- సాతాపూర్‌లో ఫ్లెక్సీలు కడుతుండగా 50 మంది అధికార పార్టీ నేతల దాడి
- ప్రాణాపాయం నుంచి బయటపడిన పరమేశ్
- ఆదరణ పెరుగుతుండడంతోనే అక్కసు
- గతంలోనూ సదరు నేతపై దౌర్జన్యం
- పరామర్శించిన ఎమ్మెల్సీలు కవిత, నవీన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే బీరం

నాగర్‌కర్నూల్/కొల్లాపూర్/పెద్దకొత్తపల్లి, ఫిబ్రవరి 28 : బీఆర్‌ఎస్ నేత శ్రీధర్‌రెడ్డి హత్యా ఘటన మరవకముందే పెద్దకొత్తపల్లి మండలంలో మరో నాయకుడు, మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ గుజ్జుల పరమేశ్ నాయుడుపై హత్యాయత్నం జరిగింది. ప్రభుత్వ పథకాలపై ప్రశ్నించినందుకు మనస్సులో పెట్టుకొని పరమేశ్‌పై రెండో సారి హత్యాయత్నానికి అధికార పార్టీ నాయకులు పాల్పడిన ఘటన నాగర్‌కర్నూల్ జిల్లాలో సంచలనంగా మారింది. 2023 నవంబర్ 29న తెల్లారితే పోలింగ్ ఉన్న సందర్భంగా బీఆర్‌ఎస్ శ్రేణులను, ఏజెంట్లను భయభ్రాంతులకు గురిచేసేందుకు అర్ధరాత్రి గుజ్జుల పరమేశ్ నాయుడు ఇంటిపై కొందరు దుండగులు దాడి చేసి హత్యాయత్నానికి ప్రయత్నించారు. తాజాగా గురువారం రాత్రి కూడా ఆయనపై దాడి జరిగింది. ఎమ్మెల్సీ కవిత వస్తుండడంతో సాతాపూర్ బస్టాండ్ ఆవరణలో ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తుండగా.. కాంగ్రెస్ నాయకులు శివరావుతో పాటు 50 మంది కలిసి పరమేశ్‌పై పథకం ప్రకారం దాడి చేశారు. అక్కడే ఉన్న గ్రామస్తులు కలుగజేసుకోవడంతో రెప్పపాటులో ప్రాణాపాయం నుంచి ఆయన బయటపడ్డారు. కాంగ్రెస్ నాయకుల చేతిలో తీవ్రంగా గాయపడిన పరమేశ్‌ను బీఆర్‌ఎస్ నాయకులు హుటాహుటిన నాగర్‌కర్నూల్ ప్రభుత్వ దవాఖానకు తరలించి చికిత్స చేయించారు. ఈ ఘటనతో గ్రామంలో ఎప్పుడు ఏ క్షణం ఏం జరుగుతుందోనని ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. ఎన్నికల ముందు రైతుభరోసా, రైతు రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చి ఎన్నికల తర్వాత కొందరికి మాత్రమే ఇచ్చి కాంగ్రెస్ ప్రభుత్వం చేతులు దులుపుకొందని, కల్యాణలక్ష్మిలో తులం బంగారం, ఇందిరమ్మ ఇండ్లు ఏమయ్యాయని గురువారం కొందరితో గ్రామంలో పరమేశ్ చర్చించినట్లు తెలిసింది. దీంతో కాంగ్రెస్ నాయకులు గ్రామంలో బీఆర్‌ఎస్ పా ర్టీకి మళ్లీ ఆదరణ పెరుగుతోందని గ్రహించి పథకం ప్రకారం కొందరికి మద్యం తాగించి దాడికి పథకం రచించారు. ప్రభుత్వానికి చేతనైతే సంక్షే మ పథకాలను అమలు చే యాలి కానీ.. ఇలా భౌతిక దాడులకు పాల్పడితే ఎలా అని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గ్రామంతోపాటు మండలంలో రాజకీయంగా ఎదుగుతున్న బీసీ నేతను తప్పించేందుకే హత్యాయత్నం చేశారని బీసీ సంఘాల నాయకులు ఆరోపించారు.



గాయపడ్డ పరమేశ్

### గతంలోనూ దాడులు

గతేడాది సాధారణ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ శ్రేణులను భయభ్రాంతులకు గురి చేసేందుకు గతంలో కాంగ్రెస్ నాయకులు చేసిన దాడుల నుంచి కూడా గుజ్జుల పరమేశ్ ప్రాణాలతో బయటపడ్డాడు. నవంబర్ 30న పోలింగ్ ముందు రోజు రాత్రి ఏజెంట్ల ఏర్పాట్లు, పోలింగ్ మేనేజ్‌మెంట్‌పై కార్యకర్తలతో మాట్లాడుతుండగా ఇంటిపైకి వచ్చి దాడి చేసి హతమార్చేందుకు ప్రయత్నం చేశారని, కాంగ్రెస్ నాయకులతో తనకు ప్రాణహాని ఉందని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కానీ ఇంతవరకు ఎలాంటి పురోగతి లేకపోవడంతోనే మళ్లీ దాడులు చేసేందుకు స్వేచ్ఛ దొరికినట్లు అయిందని కొందరు చర్చించుకుంటున్నారు. పరమేశ్‌పై దాడి జరుగుతున్న సమయంలో అక్కడే పోలీస్ లున్నా దాడిని ఆపలేకపోయారు. అంటే పోలీస్ వ్యవస్థ అధికార పార్టీ కనుసన్నల్లోనే మెలుగుతుండంతోనే బీఆర్‌ఎస్ నాయకులపై భౌతిక దాడులు జరగడం పరిపాటిగా మారిందని పార్టీ వర్గాలు ఆరోపిస్తున్నాయి.



2023లోనూ గాయపడిన పరమేశ్ (ఫైల్)



పరమేశ్‌ను పరామర్శిస్తున్న ఎమ్మెల్సీలు కవిత, నవీన్‌రెడ్డి

### కార్యకర్తల జోలికొస్తే సహించేది లేదు : కవిత

కొల్లాపూర్/పెద్దకొత్తపల్లి, ఫిబ్రవరి 28 : బీఆర్‌ఎస్ పార్టీ కార్యకర్తల జోలికి వస్తే సహించేది లేదని ప్రభుత్వాన్ని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత హెచ్చరించింది. పెద్దకొత్తపల్లి మండలం సాతాపూర్‌లో కాంగ్రెస్ నాయకుల దాడిలో గాయపడిన మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్, బీఆర్‌ఎస్ నేతల గుజ్జుల పరమేశ్ నాయుడును శుక్రవారం ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డితో కలిసి కవిత పరామర్శించారు. ధైర్యంగా ఉండాలని, భవిష్యత్ బీఆర్‌ఎస్‌దే అని భరోసానిచ్చారు. ప్రభుత్వ పథకాలపై ఎప్పటికప్పుడు విమర్శలు చేస్తున్నాడని మనస్సులో పెట్టుకున్న అధికార పార్టీ నాయకులు అదును చూసి దాడికి పాల్పడ్డారని ధ్వజమెత్తారు. తన పర్యటన సందర్భంగా ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తుండగా.. కాంగ్రెస్ పార్టీ దుండగులు దాడి చేయడం హేయనీయమన్నారు.

### శాంతిభద్రతలను కాపాడాలి : నవీన్, బీరం



ఎస్సైతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ నవీన్, మాజీ ఎమ్మెల్యే బీరం

గ్రామాల్లో శాంతి భద్రతలను కాపాడాల్సి బాధ్యత పోలీసులపై ఉందని ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం పెద్దకొత్తపల్లి పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి సాతాపూర్‌కు చెందిన బీఆర్‌ఎస్ నేత గుజ్జుల పరమేశ్ నాయుడుపై జరిగిన దాడి ఘటనపై ఇచ్చిన ఫిర్యాదుపై ఆరా తీశారు. దాడి జరిగిన సమయంలో పోలీసులు అక్కడే ఉన్నా ఎందుకు అడ్డుకోలేదని ప్రశ్నించారు. దాడి చేసిన వారిని వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. బీఆర్‌ఎస్ శ్రేణులపై భౌతిక దాడులకు పాల్పడితే సహించేది లేదని బీరం హెచ్చరించారు. హత్యా రాజకీయాలను మానుకోవాలని సూచించారు. ఎల్లకాలం కాంగ్రెస్ ప్రభుత్వం ఉండదు.. మా ప్రభుత్వం వచ్చిన రోజు ప్రజాస్వామ్యబద్ధంగా, చట్టబద్ధంగా వడ్డీతో సహా అన్ని చెల్లించే రోజులు దగ్గరలోనే ఉన్నాయన్నారు. దాడికి పాల్పడిన నిందితులను అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. వారి వెంట బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు రంగినేని అభిలాష్‌రావు, నాయకులు ఉన్నారు.

# కోనేరులో మునిగిన విద్యార్థి మృతదేహం లభ్యం

- 120 ఫీట్ల లోతులో వెలికితీసిన ఎన్‌డీఆర్‌ఎఫ్ బలగాలు
- మృతదేహంతో విద్యార్థి తల్లిదండ్రులు, బంధువుల ధర్నా

వెల్దండ, ఫిబ్రవరి 28 : మండలంలోని గుండాల కోనేరులో శివరాత్రి రోజున గల్లంతైన జేపీనగర్ గురుకుల విద్యార్థి ఓమేశ్ మృతదేహం ఎట్టకేలకు లభ్యమైంది. రెండురోజులపాటు కోనేటిలో ఎంత గాలించినా దొరకని మృతదేహం మూడోరోజు మరో కోనేరులో లభ్యమైంది. ఎన్డీఆర్‌ఎఫ్ (జాతీయ విపత్తు ప్రతిస్పందన దళం) బలగాలు రంగంలోకి దిగి మొదటి రోజు విద్యార్థి మునిగిన కోనేరులో లభ్యం కాకపోవడంతో సొరంగం ద్వారా మరో కోనేరుకు మృతదేహం కొట్టుకుపోయి ఉంటుందన్న అనుమానంతో రెండోరోజు మరో కోనేరులో వెతకగా 120 పీట్ల లోతులో మృతదేహం కన్పించడంతో ఎన్టీఆర్‌ఎఫ్ 10వ బెటాలియన్ బృందం సభ్యులు పృథ్వీ, లవరాజ్ రిస్క్ చేసి కోనేరు సొరంగంలోకి దిగి మృతదేహాన్ని వెలికితీశారు.

### న్యాయం చేయాలని ధర్నా..

తమకు న్యాయం చేయాలంటూ విద్యార్థి తల్లిదండ్రులు మృతదేహంతో ధర్నా నిర్వహించారు. రూ.కోటి ఎక్స్‌గ్రేషియా, ఇంట్లో ఒకరికి ఉద్యోగం, 5 ఎకరాల పొలం ఇవ్వాలని, ఇలాంటివి పునారావృతం కాకుండా ఆలయం, కళాశాలలో చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బాధితులకు బీఆర్‌ఎస్, ధర్మ సమాజ్ పార్టీ నాయకులు మద్దతు పలికారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కలెక్టర్‌తో మాట్లాడి రూ.10లక్షలు తక్షణ సాయంగా మంజూరు చేస్తామని హామీ ఇచ్చినట్లు జేసీ యాదగిరి, సీఐ విష్ణువర్ధన్‌రెడ్డి, తాసీల్దార్ ఇబ్రహీం తెలపడంతో ఆందోళన విరమించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కల్వకుర్తి ప్రభుత్వ దవాఖానకు తరలించి అక్కడి నుంచి స్వగ్రామం వనపర్తి జిల్లా గోపాల్‌పేట మండలం మున్ననూరుకు తరలించారు.



విద్యార్థి మృతదేహాన్ని తీసుకొస్తున్న ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందం



ధర్నా చేస్తున్న విద్యార్థి తల్లిదండ్రులు, బంధువులు

## చివరి దశకు రెస్క్యూ ఆపరేషన్

- కార్మికులు చిక్కుకున్న ప్రదేశాన్ని స్పాట్ చేసిన ఎన్‌డీఆర్‌ఐ
- చిక్కుకున్న వారిని వెలికితీసే చర్యలు
- నేడు రెస్క్యూ ఆపరేషన్ను ముగించే అవకాశం
- టన్నెల్ వద్ద హడావిడి.. రెడీగా అంబులెన్సులు
- రంగంలో ఆర్మీ, నేవీ, సింగరేణి టీం
- సహాయక చర్యలు సాగుతున్నాయి : కలెక్టర్
- స్పాట్లు గుర్తించింది వాస్తవమే : సింగరేణి ఎండీ
- నేటి పనుల పర్యవేక్షణకు మంత్రి డుమ్మా..




సహాయక చర్యలు చేపడుతున్న రెస్క్యూ టీం

# ఏ క్షణమైనా..?

మహబూబ్‌నగర్ ఫిబ్రవరి 28 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)/దోమల పెంట/అమ్రాబాద్ : నాగర్‌కర్నూలు జిల్లా దోమల పెంట ఎస్‌ఎల్‌బీసీ సొరంగం ప్రమాదం జరిగి ఎనిమిది రోజుల తర్వాత ఒక కొలిక్కి వచ్చే అవకాశం కనిపిస్తోంది. ఏ క్షణమైనా లోపల ఉన్న వారిని బయటికి తీసే అవకాశం ఉందని తెలుస్తోంది. సరిగ్గా వారం రోజుల కిందట ఈ ప్రమాదం జరగగా శుక్రవారం కార్మికులు చిక్కుకున్న ప్రదేశాన్ని ఐడెంటిఫై చేశారు. ఉదయం నుంచి రాత్రి వరకు వివిధ బృందాలు ప్రమాదం జరిగిన 14వ కిలోమీటర్ వద్దకు వెళ్లి జీపీఆర్ స్కానింగ్ చేపట్టారు. ఈ స్కానింగ్ రిపోర్టులను పరిశీలించిన నేషనల్ జియోగ్రాఫిక్ రీసెర్చ్ ఏజెన్సీ ఐదు స్పాట్లలో కార్మికులు ఉన్నట్లు ప్రాథమికంగా నిర్ధారించింది. ఈ స్పాట్లలో మార్కింగ్ చేసిన అనంతరం సహాయక చర్యలు మరింత ముమ్మరం చేశారు. రంగంలోకి ఎన్‌డీఆర్‌ఐ, ఆర్మీ, నేవీ, సింగరేణి బృందాలను లోపలికి పంపించారు. సొరంగం సమీపంలో అంబులెన్సులను సిద్ధంగా ఉంచారు. ఎస్‌ఎల్‌బీసీ టన్నెల్ వద్ద ఉన్నత అధికారులు ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షిస్తున్నారు. ఇలా ఉండగా మీడియాలో వస్తున్న కథనం పూర్తిగా నిరాధారమని నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ బడావత్ సంతోష్ ఖండించారు. కాగా సింగరేణి తరపున సహాయక చర్యలను దగ్గరుండి పర్యవేక్షిస్తున్న సీఎండీ బలరాం మాత్రం ఎన్‌డీఆర్‌ఐ స్పాట్లను గుర్తించిన సమాచారం వాస్తవమేనని వెల్లడించారు. మరోవైపు ఈ ప్రమాద సంఘటనను పర్యవేక్షిస్తున్న మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి డుమ్మా కొట్టారు.

### స్పాట్ల మార్కింగ్

ఎస్‌ఎల్‌బీసీ సొరంగంలో చిక్కుకున్న కార్మికులను బయటకు తీసే అవకాశం ఉండడంతో టెన్షన్ వాతావరణం నెలకొన్నది. ఉన్నతాధికారుల ఆదేశం మేరకు అంబులెన్స్‌లు రెడీ చేసి ఉంచారు. సాయంత్రం నుంచి పని బృందాలు సొరంగం లోపలికి వెళ్లి వస్తున్నాయి. గుర్తించిన స్పాట్లను మార్కింగ్ చేసి ఆ ప్రదేశాల్లో బురదలు తొలగిస్తున్నారు. కాగా అక్కడే టీబీఎం మిషన్ ముందు భాగం పడి ఉంటుందని అంచనా వేస్తున్నారు. ఒక్కసారిగా సొరంగం కుప్పకూలి టీబీఎం మెషిన్ ముక్కలైందని.. దాని ముందు భాగంలోని ఎనిమిది మంది కార్మికులు చిక్కుకొని ఉంటారని ముందు నుంచే అంచనాకు వచ్చారు. తాజాగా ఎన్‌జీఆర్‌ఐ కూడా ఇదే స్పాట్లను ఐడెంటిఫై చేయడంతో హై రెస్క్యూ ఆపరేషన్ ప్రారంభమైంది.

### నేడు మధ్యాహ్నం వరకు సహాయక చర్యలకు ముగింపు..

ఎన్‌డీఆర్‌ఐ ఆధ్వర్యంలో జీపీఆర్ స్కానింగ్ నిర్వహించి స్పాట్లను గుర్తించడంతో శనివారం సహాయక చర్యలు పూర్తయ్యే అవకాశం ఉందని ఉన్నతాధికారులు అంటున్నారు. ప్రమాదం జరిగిన వారం రోజుల తర్వాత రెస్క్యూ ఆపరేషన్ స్పీడ్ అందుకుంది.

### చిక్కుకున్న వాళ్లు క్షేమమేనా?

సొరంగ ప్రమాదంలో చిక్కుకున్న ఎనిమిది మంది కార్మికులు క్షేమంగానే ఉన్నారా? అని అనుమానాలు కలుగుతున్నాయి. ఇప్పటికే వారి బంధువులు ఇక్కడికి వచ్చారు. లోపల చిక్కుకున్న తమ వారి కోసం ఎదురుచూస్తున్నారు. కాగా చిక్కుకున్న వారి బంధువులను మీడియా కంట పడకుండా అధికారులు దాచి పెడుతున్నారు. మరోవైపు వారికి ఎలాంటి సమాచారం ఇవ్వకపోవడంతో ఏం జరుగుతుందో ఆందోళన మొదలైంది. కాగా సొరంగం పనులు చేయడానికి వచ్చిన సుమారు 200 మంది కార్మికులు ఇక్కడి నుంచి తట్టబుట్టా సర్దుకొని వెళ్లిపోయారు.

### టెన్షన్ టెన్షన్‌గా..

ఎస్‌ఎల్‌బీసీ సొరంగ ప్రమాదంలో చిక్కుకున్న వారిని బయటకు తీసుకువచ్చే అవకాశం ఉండడంతో టెన్షన్ వాతావరణం నెలకొన్నది. ఎప్పుడు ఏం జరుగుతుందో అన్న ఆత్రుత ఇటు రెస్క్యూ సిబ్బందిలో అటు అధికారుల్లో నెలకొంది. ప్రమాదం జరిగి సరిగ్గా వారం రోజులు అవుతుంది. ఎనిమిది రోజుల తర్వాత చిక్కుకున్నవారు బయటపడే అవకాశం కనిపిస్తుంది. ఈ సొరంగ ప్రమాదం దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. కార్మికులంతా క్షేమంగా బయటికి రావాలని ప్రతి ఒక్కరూ కోరుకుంటున్నారు. ఏం జరుగుతుందో వేచి చూడాల్సిందే..





ఎస్‌ఎల్‌బీసీ టన్నెల్‌లో టీబీఎంను కట్ చేస్తున్న ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందం సభ్యులు

← సహాయక చర్యలు చేపడుతున్న రెస్క్యూ టీం

# పేట-కొడంగల్ భూ సేకరణకు.. అడుగడుగునా అడ్డంకులు

- పచ్చని పొలాల్లో పోలీసుల బూట్ల చప్పుళ్లు..
- కేసులకు భయపడి బిక్కుబిక్కుమంటున్న రైతులు



అధికారులతో వాగ్వాదానికి దిగిన బీఆర్‌ఎస్ నాయకులు, రైతులు

ఊట్కూర్, ఫిబ్రవరి 28 : నారాణపేట-కొడంగల్ ఎత్తిపోతల ప్రాజెక్టు నిర్మాణం కోసం చేపట్టిన భూ సేకరణ సర్వేను రైతులు అడుగడుగునా అడ్డుకుని నిరసన వ్యక్తం చేస్తున్నారు. ఈ కర్మంలో శుక్రవారం ఊట్కూర్ మండలంలోని జీర్ణహల్లి, దంతన్‌పల్లి శివారులో అధికారులు భూ సేకరణ కోసం నిర్వహించిన సర్వేను రైతులు అడ్డుకున్నారు. సర్వేలో పాల్గొన్న తాసీల్దార్ చింత రవితో రైతులు వాదినకు ది గారు. తమ పొలాల్లో ఓపెన్ కెనాల్ ఏర్పాటు చేస్తే ఉన్న కొద్దిపాటి భూములను కోల్పోయి కుటుంబాలు రోడ్డున పడాల్సి వస్తుందని రైతులు అధికారుల ఎదుట తమ గోడును వెల్లబోసుకున్నారు. రైతులకు మద్దతుగా బీఆర్‌ఎస్ నాయకులు, మాజీ జెడ్పీటీసీ అరవింద్‌కుమార్, మండల పార్టీ అధ్యక్షుడు లక్ష్మారెడ్డి, మండల యువజన అధ్యక్షుడు ఆనంద్‌రెడ్డి, ఒబేదుర్ రెహమాన్, తరుణ్‌రెడ్డి, బీజేపీ నాయకులు భాస్కర్, భరత్, హన్మంతులు రైతులకు మద్దతుగా నిలిస్తూ దంతన్‌పల్లి శివారులో ప్రధాన రహదారి పక్కన వ్యవసాయ పొలాలు ప్రస్తుతం ఎకరం రూ.50 లక్షల పైమాటే ఉందని, ప్రాజెక్టు నిర్మాణంలో భూములు కోల్పోతున్న రైతులకు ప్రభుత్వం ఏ విధమైన సహాయం అందిస్తుందో సమావేశం నిర్వహించాలని అధికారులతో వాదించారు. పోలీసులను అడ్డుపెట్టి బలవంతంగా సర్వే నిర్వహించడం ప్రభుత్వానికి తగదన్నారు. ప్రభుత్వం రైతులకు తగిన పరిహారం అందించి చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని డిమాండ్ చేశారు.

### పచ్చని పొలాల్లో పోలీసుల బూట్ల చప్పుళ్లు..

నారాయణపేట-కొడంగల్ ఎత్తిపోతల భూ సేకరణ సర్వేకు రైతుల నుంచి తీవ్ర వ్యతిరేకత కొనసాగుతుండటంతో ముందస్తు జాగ్రత్తగా అధికారులు పోలీసు బలగాలను అడ్డం పెట్టి సర్వే నిర్వహిస్తున్నారు. సర్వే సందర్భంగా తెల్లారిందే మొదలు రైతుల పొలాల్లో పోలీసులు మోహరిస్తున్నారు. ఊట్కూర్ మండలం జీర్ణహల్లి, దంతన్‌పల్లి శివారులో మక్తల్, మాగనూర్, ఊట్కూర్ ఎస్సైలు భాగ్యలక్ష్మీరెడ్డి, అశోక్‌బాబు, కృష్ణంరాజు ఆధ్వర్యంలో భారీగా పోలీసులు మోహరించారు. పచ్చని పొలాల్లో పోలీసుల బూట్ల చప్పుళ్లకు రైతులు బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు.

తమ పొలాల్లో అధికారులు బలవంతంగా సర్వే నిర్వహిస్తున్నప్పటికీ కేసులకు భయపడాల్సి వస్తోందని బాధిత రై తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల లగచర్ల గిరిజన రైతులపై జరిగిన దమన కాండను వారు స్వయంగా గుర్తు చేస్తున్నారు.



పొలాల్లో మోహరించిన పోలీసు బలగాలు